


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

మంగళవారం 1-4-2025

సంపుటి: 21 సంచిక: 6

పేజీలు: 8 వెల: రూ.1

## పన్ను వసూలులో
# కార్పొరేషన్ ఆల్‌టైమ్ రికార్డ్

**- ఒక కమిషనర్, ఇద్దరు ఆర్ఐలతో సాధ్యమైన ఫీట్ -**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధిలో ఇంటి పన్ను, ఖాళీ స్థల పన్ను, కుళాయిపన్ను వసూళ్లలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో శ్రీకాకుళం కార్పొరేషన్ ఆల్‌టైమ్ రికార్డ్ సాధించింది. ఇప్పటి వరకు కార్పొరేషన్ చరిత్రలో లేనివిధంగా రూ.26.75 కోట్లు వసూలుచేసింది. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియడంతో పాటు పన్ను వసూలుకు కూడా గడువు తీరిపోవడంతో సోమవారం అర్ధరాత్రి వరకు వేసిన లెక్కల మేరకు రూ.26.75 కోట్లు వసూలు చేశారు. ఇదే కార్పొరేషన్‌లో గత ఏడాది.. అంటే 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.20 కోట్ల పన్నును వసూలు చేశారు. దీంతో పోలిస్తే ఈ ఏడాది రూ.6.50 కోట్లు ఎక్కువ వసూలైంది. గత ఏడాది మార్చి నెలతో పోలిస్తే ఈ ఏడాది మార్చిలో రూ.8.75 కోట్లు అధికంగా వసూలు చేశారు. ఒక్క మార్చి 31వ తేదీనే రూ.1.26 కోట్లు పన్నుల రూపంలో రాబట్టగలిగారు. ఓ పథకం ప్రకారం రూ.లక్ష దాటిన బకాయిలకు ఒకసారి డ్రైవ్, రూ.50వేలు లోపు బకాయిలుంటే మరోసారి డ్రైవ్ నిర్వహించి పకడ్బందీగా పన్నులు వసూలుచేశారు. మొండిబకాయిలు రాబట్టడం కోసం 120 షాపులకు తాళాలు వేయగా 300 కుళాయి కనెక్షన్లు కట్ చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చినా వడ్డీపై పన్ను రాయితీ ఇస్తుంది. ఈసారి 50 శాతం రాయితీ ఇవ్వడంతో దీన్ని వినియోగించుకోవాలని పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. అప్పటికీ చాలామందిలో కదలిక లేకపోవడంతో ఇళ్లకు తాళాలు వేయడం, షాపులు సీజ్ చేయడం వంటివి చేశారు. దీంతో బకాయిదారులు దిగివచ్చారు. 17 రెవెన్యూ వార్డులున్న శ్రీకాకుళం కార్పొరేషన్‌లో కేవలం ఇద్దరు మాత్రమే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరిని కోఆర్డినేట్ చేయడంలో కమిషనర్ దుర్గాప్రసాదరావు సఫలీకృతమయ్యారు. నగర పరిధిలో 90 శాతం పన్నులు వసూలుకాగా, మిగిలిన 10 శాతం భవనాలకు సంబంధించి కొన్ని కోర్టు కేసుల్లో ఉండగా, మరికొన్ని మురికివాడల్లో ఉన్నాయి. కార్పొరేషన్‌లో విలీనమైన పంచాయతీల్లో మాత్రం దాదాపు రూ.6కోట్లు బకాయిలు వసూలు కావాల్సి ఉన్నా గడువు ముగియడంతో వసూలు చేయలేకపోయారు. సచివాలయాల్లో సిబ్బంది లేకపోవడం, ఉన్నవారికి భవన యజమానులు ఎవరో తెలియకపోవడం వల్ల ఇక్కడ వసూలు మందగించింది. గత ఏడాది 23వేల మంది నుంచి పన్నులు వసూలుచేయగా, ఈసారి 35,800 మంది నుంచి బకాయిలు రాబట్టారు. కోర్టు కేసుల్లో ఉన్న కమర్షియల్ భవనాలకు సంబంధించి ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంటే కార్పొరేషన్‌కు ఇప్పుడు వసూలుచేసిన దానికంటే ఎక్కువ ఆదాయం వస్తుంది.

## బీరు 'కొట్టే'స్తున్న
# ఎక్సైజ్ బాబులు!

**కంచే చేను మేయడం అంటే ఇదే. రక్షించాల్సినవారే భక్షిస్తున్న తీరు విస్మయం గొలుపుతున్న ఈ ఉదంతం వివరాల్లోకి వెళితే.. ఆ కర్మాగారంలో తయారైన సరుకు నాణ్యతను, పరిమాణాన్ని పరిశీలించాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు వారు. అక్కడ తయారైన సరుకు ప్రభుత్వానికి చేరేలోగా కర్మాగారంలో గానీ, బయటి వ్యక్తులు గానీ వాటిని దారి తప్పించి బహిరంగ మార్కెట్‌లోకి తీసుకుపోకుండా చూడాల్సిన బాధ్యత వారిది. కానీ వారే స్వయంగా దొంగతనం చేసి పోలీసులకు దొరికిపోయారు.**

- ప్రభుత్వం తరఫున ఫ్యాక్టరీలో విధులు
- నాణ్యత పరిరక్షణ, అక్రమ తరలింపులకే అడ్డుకట్టే బాధ్యత
- విధులకే ఎసరు తెస్తూ కొసరు వ్యవహారాలు
- తయారయ్యే బీర్ బాటిళ్లను ఎత్తుకెళ్లి అమ్ముకుంటున్న వైనం
- అలా తరలిస్తూ హైవే పెట్రోలింగ్‌కు చిక్కిన ఎక్సైజ్ కానిస్టేబుల్
- 52 హైక్వాలిటీ బీర్ బాటిళ్లు స్వాధీనం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రణస్థలం మండలం బంటుపల్లి వద్ద ఉన్న యునైటెడ్ బ్రేవరీస్‌లో ఉత్పత్తి చేస్తున్న బీరుతో నిండిన బాటిళ్లను ఫ్యాక్టరీ నుంచి అక్రమంగా తరలిస్తూ ఎక్సైజ్ కానిస్టేబుల్ బొడ్డేపల్లి జగదీష్ పోలీసులకు దొరికిపోయారు. బంటుపల్లి బీరు ఫ్యాక్టరీలో ప్రభుత్వ ప్రతినిధిగా విధులు నిర్వర్తిస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ బొడ్డేపల్లి జగదీష్ సోమవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఫ్యాక్టరీలో విధులు ముగించుకొని తన స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో హైవే పెట్రోలింగ్‌లో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్న జేఆర్‌పురం పోలీసులకు దొరికిపోయారు. ఆయన వద్ద 52 బీరుబాటిల్స్ (కింగ్‌ఫిషర్ స్ప్లెండిడ్ (స్ట్రాంగ్ బీర్) లభించగా, వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బంటుపల్లి ఫ్యాక్టరీలో కింగ్‌ఫిషర్ బీర్లే తయారవుతుండటం విశేషం.

### అక్కడ పట్టించోకోకున్నా.. ఇక్కడ పట్టుబడ్డారు

ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయ్యే బీర్ల నాణ్యత, పరిమాణాన్ని పరిశీలించేందుకు ప్రభుత్వం తరఫున ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ నుంచి ముగ్గురు కానిస్టేబుళ్లు, ఇద్దరు సీఐలు, ఒక అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎక్సైజ్ ఉంటారు. అయితే గత కొంతకాలంగా ఇక్కడ ఏసీ పోస్టు ఖాళీగా ఉంది. ఇక ఇద్దరు సీఐలు వారంలో సగం రోజులు ఒకరు, మిగిలిన సగం రోజులు ఇంకొకరు చొప్పున డ్యూటీ సర్దుకుంటున్నారు. దీనివల్ల ఎక్సైజ్ కానిస్టేబుళ్లపై పర్యవేక్షణ కొరవడింది. కొందరు సుదీర్ఘ కాలంగా ఇదే బీరు ఫ్యాక్టరీలో ఎక్సైజ్ తరఫున కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. నిత్యం బీరు బాటిళ్లు ఇక్కడి నుంచి తీసుకుపోవడం సాధారణమేనంటున్నారు. అడిగితే లేనిపోని కొర్రీలు పెడతారన్న భయంతో బీరు తయారీ సంస్థ అధికారులు ఇన్నాళ్లూ చూసీచూడనట్లు వ్యవహరించారు. అయితే సోమవారం రాత్రి కానిస్టేబుల్ బొడ్డేపల్లి జగదీష్ తన యమహా ద్విచక్ర వాహనంపై రెండు సంచుల్లో 52 బీరుబాటిళ్లు తీసుకెళుతూ హైవేలో తాజ్ పెట్రోల్‌బంక్ వద్ద పెట్రోలింగ్ పోలీసులకు దొరికిపోయాడు. ఒక్కో బీరు బాటిల్ ఖరీదు మార్కెట్‌లో రూ.650 ఉంది. వీటిని విక్రయించడం ద్వారా సొమ్ము చేసుకుంటున్నారని తెలుస్తోంది. గతంలో యూబీ ఫ్యాక్టరీ నుంచి బయటకు వెళ్లే లారీల వద్ద లోడుకు ఇంత అని వసూలు చేసేవారు. గత కొంతకాలంగా యూబీ యాజమాన్యం దీన్ని కట్టడి చేసింది. ఫ్యాక్టరీలో మంచి భోజనం, ఉండటానికి ఏసీ గదులు ఇస్తాం తప్ప లారీ నుంచి వసూలు చేయడానికి వీల్లేదని స్పష్టం చేసిన తర్వాత బీరు బాటిళ్ల తరలింపు పెరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం ఇక్కడ బీరు తయారీకి ఉపయోగించే రసాయనాలకు సంబంధించి ఎక్సైజ్‌శాఖ కొన్ని అభ్యంతరాలు లేవనెత్తింది. ప్రస్తుతం ఈ అంశం ఎక్సైజ్ కమిషనరేట్‌లో పెండింగ్‌లో ఉంది.



• ఎడిటోరియల్

# పతనాన్ని శాసిస్తున్న ఆన్‌లైన్ జూదం

మహాభారతంలో కురుక్షేత్ర యుద్ధం ఎందుకు జరిగిందంటే జూదమే కారణమని చెప్పకతప్పదు. కురు పాండవ అగ్రజుల మధ్య జరిగిన జూదంలో పాండవులు రాజ్యాన్ని, చివరికి భార్యను కూడా కోల్పోతారు. అరణ్య, అజ్ఞాతవాసాలు చేస్తారు. అయినా తిరిగి తమ రాజ్యాన్ని పొందేందుకు కురుక్షేత్ర యుద్ధం చేయక తప్పలేదు. అది భారత కథ. రాజుల నాటి కథ. రాజులు జూదం ఆడటం ఆ కాలంలో రివాజే. అయితే అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడయినా.. జూదం ఆశతో మొదలై అత్యాశతో కూడుకుని దురాశగా పరిణామం చెందుతుంది. చివరాఖరికి అందరినీ ముంచుతుంది. జూదమూ ఓ రకమైన పందెమే! బానిస సమాజంలోనైతే పందెం కాసి, ఇద్దరు బానిసలను బల ప్రయోగానికి, చంపుకోవడానికి పురికొల్పేవారు. ఇప్పటి కోడి పందేలలాంటిదన్నమాట. ఇదో భూస్వామిక విధానపు క్రూరవినోదం. ప్రజలు దీనికి సమిధలు, ప్రజాధనం దీనికి సమర్పణం. కట్ చేస్తే.. ఆధునిక వ్యాపార సమాజంలో లాభాల ఆశల ఎరకు చిక్కి జూద క్రీడకు బలైపోతున్న సామాన్య ప్రజల దీనగాథలు కోకొల్లలు. ఈ దోపిడీ వ్యవస్థలో కునారిల్లిపోతున్న, దారిద్ర్యం ముంచెత్తుతున్న సామాన్య ప్రజల ఆశలను, ఆవేశాలను వినియోగించుకుని మరింత దోపిడీకి పాల్పడుతున్న పాచికలే ఈ పందెం, బెట్టింగ్, మల్టీ లెవల్ మార్కెటింగ్ మొదలైన సాధనాలు. ప్రపంచీకరణ, రియల్ ఎస్టేట్ బూమ్‌లు సమాజానికి ఈజీ మనీని పరిచయం చేశాయి. ఆ ఆశల వలలో పడి ఎంతోమంది తమ జీవితాలను, కుటుంబాలను ధ్వంసం చేసుకుంటున్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో బెట్టింగ్ యాప్‌ల రూపంలో సైబర్ దోపిడీకి తెరలేపారు నయా జూదగాళ్లు. లక్షల కోట్ల రూపాయలను సామాన్యుల నుంచి కొల్లగొట్టే సంస్థలు వేలాదిగా పుట్టుకొచ్చాయి. మన రాష్ట్రంలోనే వందలమంది ప్రాణాలను ఈ యాప్‌లు బలి తీసుకున్నాయి. భర్తలకు తెలియకుండా భార్యలు, భార్యలకు తెలియకుండా భర్తలు బెట్టింగులకు బానిసలై కుటుంబాలను బలిపెట్టుకున్నారు. ఇబ్బడిముబ్బడిగా డబ్బులు వస్తాయని కథలు చెబుతూ, భ్రమల్లో ముంచెత్తుతూ పాతాళానికి నెట్టేస్తున్నారు. మొదట చిన్నచిన్నగా లాభాల ఎర చూపిస్తారు. ఆ తర్వాత పెద్ద మొత్తాల్లో బెట్టింగులకు పూనుకోగానే ముంచి ఊరుకుంటారు. యాప్‌లే కాదు, సోషల్ మీడియాలో స్పాన్సర్స్ ప్రకటనలు కూడా విపరీతంగా ప్రసారం అవుతున్నాయి. రాష్ట్రపతి ముర్ము, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, సుధామూర్తి, ముఖేష్ అంబానీ లాంటి ప్రముఖులు చెబుతున్నట్టుగానే ఫేక్ వీడియోలు వదులుతున్నారు. రూ.21వేలు ఇన్వెస్ట్ చేస్తే నెల, రెండు నెలల్లోనే రూ.15 లక్షల వరకు సంపాదించవచ్చన్నది ఆ వీడియోల సారాంశం. 'డబ్బులెవరికీ ఊరకనే రావు' అన్న ప్రకటనను తప్పక గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. వీటిని అరికట్టడం ఎలాగో ప్రభుత్వం ఆలోచించాలి. ఈ బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లలో దేశంలోని ప్రముఖులతో పాటు సినీతారలు, ఆటగాళ్లూ పాల్గొంటున్నారు. భారతరత్న సచిన్ టెండూల్కర్, షారుక్‌ఖాన్, కోహ్లీలపైనా బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్ చేశారని ఫిర్యాదులు నమోదయ్యాయి. మన తెలుగు సినీతారలు బాలకృష్ణ, ప్రభాస్, గోపీచంద్, రానా, ప్రకాష్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, శ్యామల, విష్ణుప్రియ ఇలా ఎన్నో పేర్లు బయటకి వచ్చాయి. ఫన్-88 యాప్ ద్వారా కోట్లాది రూపాయలు తరలించుకుపోయారని ఆరోపణలొచ్చాయి. ఈ మధ్య హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులపై దాడులు చేసి సుమీరు 385 కేసులు నమోదు చేశారు. వాటి ప్రమోటర్లను ప్రశ్నిస్తున్నారు. అంతెందుకు మన మెట్రోరైల్లోనే ఈ బెట్టింగ్ యాడ్స్ పెద్ద ఎత్తున దర్శనమిస్తున్నాయి. తొలగిస్తామని అధికారులు చెబుతున్నారు. 2017లో ప్రమోషన్ యాడ్‌లో పాల్గొన్నానని, తర్వాత అది మోసమని తెలిసి రద్దు చేసుకున్నానని ప్రకాష్‌రాజ్ ప్రకటించారు. కానీ మిగతా సెలబ్రిటీలెవరూ స్పందించలేదు. కొందరు మాత్రం తెలియక చేశామంటున్నారు. బెట్టింగ్ యాప్‌లపై కఠినంగా వ్యవహరిస్తామని, ప్రచారం కల్పించేవారినీ విచారిస్తామని ప్రభుత్వం అసెంబ్లీలో వెల్లడించింది. ఐపీఎల్ పోటీలపైనా బెట్టింగ్‌లు జోరుగా జరుగుతున్నాయి. బెట్టింగుల్లో లక్షలు కోల్పోయిన ఓ యువకుడు నిన్నగాక మొన్న ఆత్మహత్య చేసుకున్నాడు. తక్కువ సమయంలోనే భారీ లాభాలిస్తామని డెయిరీఫామ్ నిర్వహిస్తున్నామని ఊదరగొట్టిన ఓ ఫేక్ సంస్థ రూ.20కోట్లతో బిచాణా ఎత్తేసింది. ఈ ఆర్థిక నేరగాళ్ల సైబర్ ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. డబ్బుపై ప్రజలకున్న ఆశను ఆసరా చేసుకుని ఇలాంటి మోసాలకు పాల్పడటం ఈ మధ్యకాలంలో బాగా పెరిగింది. సామాజిక బాధ్యత మరిచిన పలువురు తారలు, ప్రముఖుల ప్రచారం తోడవుతోంది.



స్థానిక 43వ డివిజన్ హయాతినగరంలో వార్డు ఇన్‌చార్జ్ తోణంగి వెంకన్నయాదవ్ ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐ.వర్మ, ఎ.అప్పలరాజు, రమేష్ రాజు, టైలర్ చిన్న, మన్మథ, జగదీష్, జోగఅప్పారావు, ఉమ్మడి కూటమి నాయకులు ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. అదే విధంగా 21వ డివిజన్ బాకర్‌సాహెబ్‌పేటలో మంగళవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ అధికారులు పింఛన్లు పంపిణీ చేశారు. **- సత్యంన్యూస్, శ్రీకాకుళం**



## వీహెచ్‌పీ క్యాలెండర్ ఆవిష్కరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విశ్వ హిందూపరిషత్ క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మెల్యే గొండుశంకర్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ హిందూ సంప్రదాయం ప్రకారం ఉగాది మనకి నూతన సంవత్సరంగా వస్తుందన్నారు. ఈ నూతన సంవత్సరం ప్రారంభం నుండి తిథి, వార నక్షత్రాలు అనుసంధానంగా హిందువులు కార్యక్రమాలు చేసుకుంటారని, అందుకు అనుకూలంగా ఈ యొక్క విశ్వ హిందూ పరిషత్ క్యాలెండర్ ఉందని తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ శ్రీకాకుళం జిల్లాఅధ్యక్షులు లోకనాదం ఆనందరావు, ఉపాధ్యక్షులు శ్రీరంగం మధుసూదనరావు, ఉపాధ్యక్షులు గొద్దు భాస్కరరావు, ధర్మవరపు ఆచారి, టీడీపీ సీనియర్ యువ నాయకులు రెడ్డి గిరిజాశంకర్ పాల్గొన్నారు



## సుప్రీంకోర్టు వ్యాఖ్యలు హర్షణీయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



దేశంలో సంక్షేమ పథకాలు అమలు చేయటానికి కేంద్ర బిందువుగా ఉన్న రేషన్ కార్డులను సద్వినియోగం చేయడంలో ప్రభుత్వాల వైఫల్యాలపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యల పట్ల అఖిలభారత బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా కన్వీనర్, సంఘ సేవకురాలు డాక్టర్ సీపాన గుణవతి హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో రేషన్ కార్డుల పంపిణీ దారిద్రరేఖ దిగువన గల బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పంపిణీ చేయాల్సి ఉండగా అధికారులు, ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల అవి పక్కదోవ పట్టి ప్రజాధనం దుర్వినియోగం కావడం పట్ల ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో రేషన్ కార్డులు ఎంతమందికి పంపిణీ చేశామన్న విషయాన్నే ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయి తప్ప ఆ పథకాలు బడుగు వర్గాల సంక్షేమానికి ఎంతవరకు ఉపయోగపడుతున్నాయో తెలుసుకోవడం లేదన్నారు. మూడంతస్తుల భవనాలు ఉన్న వర్గాలకు కూడా ఉపయోగపడటం ప్రభుత్వాల చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారులు, సచివాలయాలు ఉన్నప్పటికీ రేషన్ కార్డులు సక్రమ పద్ధతిలో సద్వినియోగం కావడం లేదన్నారు. ప్రభుత్వాలు కూడా ఈ విషయంలో క్షేత్రస్థాయిలో ఆలోచించడం లేదన్నారు.

రేషన్ కార్డులు, బియ్యం పప్పుదినుసులే కాకుండా ఇతర సంక్షేమ పథకాలు, ముఖ్యంగా ఉచిత వైద్యం, ఉచిత విద్య, అనేక సబ్సిడీలు వంటి పథకాలు దోపిడీకి గురవుతున్నాయన్నారు. ఈ పథకాలను సరైన పద్ధతిలో అమలు జరపడంలో ప్రభుత్వం విఫలమవటంతో ప్రజాధనం దుర్వినియోగమవుతుందని తెలిపారు. ప్రభుత్వాలు ఈ రేషన్ కార్డులు సక్రమ పద్ధతిలో అమలు జరిగినట్లయితే తమ పార్టీలకు రాబోయే ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గుతుందన్న అభిప్రాయం తోనే ఈ విషయంలో జోక్యం చేసుకోవడం లేదన్నారు. ప్రభుత్వాల వ్యవహార శైలిని బలహీనతలను దృష్టిలో పెట్టుకుని సుప్రీంకోర్టు చేసిన కీలక వ్యాఖ్యలు ప్రజా ప్రయోజనాలకు ఎంతో దోహదపడుతాయన్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్ళుతెరిచి సంక్షేమ పథకాలకు కేంద్ర బిందువైన రేషన్ కార్డ్ జారీ చేయడంలో తగిన జాగ్రత్త తీసుకోవలసి ఉందన్నారు. ఈ పథకాలు బలహీన బడుగు వర్గాలకు వర్తించేలా అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని డాక్టర్ గుణవతి సూచించారు.

## పోలీసు శాఖకు అందించే సేవలు అమోఘం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సుమారు 41సంవత్సరాల సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖలో ఉత్తమ సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేసిన పి.కృష్ణమూర్తిని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ కుటుంబసభ్యులు వివరాలు తెలుసుకుని, కుటుంబంతో కంటే పోలీస్ శాఖలోకి ప్రవేశించిన నాటి నుండి నేటి వరకు అహర్నిశలు ప్రజల కోసం పోలీస్ సేవలు అందించి, పదవీవిరమణ పొందడం అదృష్టమన్నారు. పదవీ విరమణ పొందడం బాధగానే ఉంటుందని, కానీ జీవితంలో ఉద్యోగం అన్న తరువాత పదవీవిరమణ పొందడం అనే అంశం సహజమన్నారు. ఉద్యోగంలో చేరినప్పుడు మొదటిరోజు ఎలా సంతోషంగా ఉంటామో చివరి రోజున కూడా అంతే ఉత్సాహంగా ఉండాలని తెలిపారు. భవిష్యత్తులో కూడా మీకు ఏదైనా సమస్యలు ఉంటే పోలీస్‌శాఖ ఎప్పుడూ అండగా ఉండి పరిష్కరించడంలో ముందుంటామని, మిగిలిన మీ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో గడపాలని, ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కేవీ రమణ డిఎస్పీ ఎల్ శేషాద్రి, ఆర్ఎస్ఐలు హరినాద్, వెంకట రమణలున్నారు.



స్థానిక గొంటివీధిలో 16వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ ఎస్వీ రమణమాదిగ ఆధ్వర్యంలో మంగళవారం పింఛన్ల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు కిషోర్, అమ్ములు, వెంకటరమణ, ఉమా, రామారావు, తారక, టీడీపీ కార్యకర్తలు కొర్లకోట కొండలరావు, లోపింటి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం**



సామి.. పితామగన్.. అపరిచితుడు చిత్రాలతో ఒకప్పుడు మామూలు హిట్లు కొట్టలేదు విక్రమ్. కానీ ఆ తర్వాత రెండు దశాబ్దాల్లో ఆ స్థాయి విజయం ఒక్కటీ అందుకోలేకపోయాడు. గత ఏడాది వచ్చిన 'తంగలాన్' సైతం అనుకున్నంతగా ఆడలేదు. ఇప్పుడు తన నుంచి వచ్చిన కొత్త చిత్రం.. వీర ధీర శూర. ప్రామిసింగ్ ప్రోమోలతో ఆకట్టుకున్న ఈ సినిమా.. విక్రమ్ నిరీక్షణకు తెరదించేలా ఉందా? తెలుసుకుందాం పదండి.

ఇప్పుడొచ్చిన 'వీర ధీర శూర'ను పార్ట్-2 పేరుతో రిలీజ్ చేయడం విశేషం. పార్ట్-1 తర్వాత వస్తుందట. ఐతే ఇది అర్థం కావాలంటే పార్ట్-1 చూసి తీరాల్సిందే అని చాటి చెప్పడం కోసమే దర్శకుడు ఈ సినిమాలో ఎక్కడ లేని గందరగోళాన్ని నింపేశాడేమో అనిపిస్తుంది. సినిమాలో అత్యంత కీలకమైన విషయాలను విడమరిచి చెప్పకపోవడంలో ఆంతర్యమేంటో దర్శకుడికే తెలియాలి.

**కథ:**

కాళి (విక్రమ్) ఒక మామూలు మధ్య తరగతి మనిషి. అతను కిరాణా కొట్టు నడుపుతుంటాడు. తనకు భార్య (దుషారా విజయన్) ఇద్దరు పిల్లలు ఉంటారు. ఇంటి అవసరాల రీత్యా ఆమె కూడా చిన్న ఉద్యోగం చేస్తూ ఉంటుంది. ఐతే ఒక రోజు రాత్రి కాళి మాజీ యజమాని అయిన రవి (పృథ్వీ).. ఓ అవసరం మీద కాళిని కలుస్తాడు. ఎస్పీ నుంచి కాపాడి తన కొడుకు కన్నా (సూరజ్)ను తీసుకురావాలని కోరతాడు. తప్పనిసరి పరిస్థితుల్లో కాళి ఆ పనికి ఒప్పుకుంటాడు. ఐతే ఈ పనికి కాళినే అడగడానికి కారణం ఉంటుంది. పదేళ్ల ముందు కాళికి ఒక భయానక గతం ఉంటుంది. అప్పుడు అతనేం చేశాడు.. తర్వాత ఎందుకు మారిపోయాడు.. ఇప్పుడు తిరిగి పాత దారిలోకి వెళ్లిన అతను అనుకున్నది సాధించాడా లేదా అన్నది మిగతా కథ.

# సీన్ తప్ప సినిమాలేదు!

**కథనం-విశ్లేషణ:**

కమర్షియల్ సినిమాల్లో హీరోను అనేక రకాల పాత్రల్లో చూశాం. సాధారణంగా కనిపిస్తూ అసాధారణమైన పనులు చేయడం 'బాషా' రోజుల నుంచి ఉన్నదే. ఐతే 'వీర ధీర శూర' కోసం ఇప్పటిదాకా ఏ స్టార్ హీరోనూ చూడని ఒక కొత్త పాత్రలో చూపించాడు దర్శకుడు ఎస్.యు.అరుణ్ కుమార్. హీరో ఇందులో కిరాణా కొట్టు నడుపుకుంటూ ఉంటాడు. అలాంటి పాత్రలోనూ హీరోయిజం పండించవచ్చన్న ఆలోచన సూపర్. ఈ ఐడియా అనే కాదు.. 'వీర ధీర శూర'లో దర్శకుడు ఎగ్జిక్యూట్ చేసిన కొన్ని సీన్లు చూసి వావ్ అనుకుంటాం. 'పార్టులు పార్టులుగా చూస్తే ఇది కూడా బాగుందే' అనే డైలాగుని గుర్తుకు తెచ్చేలా.. ఈ చిత్రంలోనూ కొన్ని సీన్లను విడివిడిగా చూస్తే భలేగా అనిపిస్తాయి. కానీ ఒక సినిమాగా చూస్తే మాత్రం 'వీర ధీర శూర' మిశ్రమానుభూతిని కలిగిస్తుంది. అసలు విషయం ఏంటో క్లారిటీగా చెప్పకుండా.. హీరో నేపథ్యం సహా సినిమాలో కాన్ఫ్లిక్ట్ కు దారి తీసే విషయాలను విడిపించి విడిపించనట్లు చూపించిన దర్శకుడు.. ప్రేక్షకులను ఆరంభం నుంచి చివరిదాకా కన్ఫ్యూజ్ చేస్తూనే ఉంటాడు. ఈ గందరగోళం వల్ల సినిమాను సరిగా ఆస్వాదించలేం. సినిమా అయ్యాక కొన్ని సీన్లు గుర్తుండిపోతాయి కానీ.. ఓ సంతృప్తికర సినిమాను చూశాం అనే ఫీలింగ్ మాత్రం కలగదు. ఉదాహరణకు హీరో ట్రిగ్గర్ అయి తన విశ్వరూపం చూపించడానికి ఒక సంఘటన దారి తీస్తుంది. తన మిత్రుడిని ఒక పోలీస్ చంపేస్తే.. అతను బదులుగా తన ఉగ్రరూపం చూపిస్తాడు. పోలీస్ స్టేషన్లోకి అర్ధనగ్నంగా వెళ్లి హీరో రెచ్చిపోయే సీన్ ప్రేక్షకులకు షాకిస్తుంది. దీన్ని ఎగ్జిక్యూట్ చేసిన తీరు సూపర్. కానీ ఆ మిత్రుడు ఎలా చనిపోయాడో దృశ్యరూపంలో చూపించకపోగా.. కనీసం మాటల్లో కూడా క్లారిటీ ఉండదు. ఇక ఆ ఫ్రెండు హీరోకు ఎంత ముఖ్యం అన్నది కూడా ఎస్టాబ్లిష్ చేయలేదు. ఈ ఎస్టాబ్లిష్మెంట్ జరగనపుడు హీరో రివోల్ట్‌లో ఎమోషన్ ఎక్కడి నుంచి వస్తుంది? కథను.. పాత్రలను కనెక్ట్ చేయకుండా కేవలం సన్నివేశాలు బాగా తీసినంత మాత్రాన ప్రేక్షకులు ఎగ్జైట్ అయిపోరు కదా? ఈ సమస్య సినిమా అంతా కొనసాగుతుంది. తన గతాన్ని అంతా పక్కన పెట్టేసి పదేళ్లుగా కిరాణా కొట్టు నడుపుకుంటున్న హీరో.. మళ్లీ తన పాత అవతారంలోకి మారడానికి కూడా సరైన కారణం కనిపించదు. అసలు తన ఉద్దేశమేంటో సరిగా చూపించలేదు.

ద్వితీయార్ధంలో హీరో ఒక టాస్క్ మీద వచ్చాక తనతో పాటు అతను టార్గెట్ చేయాల్సిన ఎస్పీ.. హీరోను ముగ్గులోకి దింపిన విలన్ గ్యాంగ్.. ఇలా అందరూ డబుల్ గేమ్ ఆడుతున్నట్లు చూపించి కథను రక్తి కట్టించడానికి ప్రయత్నించాడు కానీ.. ఎవరు ఎందుకు అలా చేస్తున్నారన్న దానిపై క్లారిటీ ఉండదు. దీంతో ఏ పాత్ర ఎందుకు అలా ప్రవర్తిస్తుందో అర్థం కాదు. దీని వల్ల కథ మీద ప్రేక్షుకులకు ఏకాగ్రత కుదరదు. అంతకంతకూ ఆసక్తి తగ్గిపోతుంది. ఐతే ఈ గందరగోళాన్ని పక్కన పెడితే.. చివరి అరగంటలో ఎపిసోడ్లు మాత్రం అదిరిపోతాయి. అప్పటిదాకా కామ్ గా కనిపించే హీరో.. ఉన్నట్లుండి విజృంభించడం మొదలయ్యాక అన్నీ మరిచిపోయి తెరకు కళ్లప్పగించేస్తాం. కథలో వచ్చే మలుపులు.. యాక్షన్ ఘట్టాలు ఆకట్టుకుంటాయి. విక్రమ్ పెర్ఫామెన్స్ పీక్స్ అనిపిస్తుంది. బ్యాగ్రౌండ్ స్కోర్ కూడా పతాక సన్నివేశాల్లో అదిరిపోయింది. ఒక దశలో పూర్తిగా ట్రాక్ తప్పేసిన 'వీర ధీర శూర' చివరి అరగంటలో మాత్రం ఎంగేజ్ చేస్తుంది. కానీ చివరికి వచ్చేసరికి సమాధానాలు లేని ప్రశ్నలు మాత్రం వెంటాడుతాయి. అసలీ కథలో లాజిక్కులే కుదరలేదు. బహుశా భవిష్యత్తులో వచ్చే 'పార్ట్-1'తో అన్ని ప్రశ్నలకూ సమాధానాలు లభిస్తాయేమో. కానీ 'పార్ట్-2'లోని గందరగోళం ఈ సినిమాకు ఎలాంటి ఫలితాన్నిస్తుందన్నదే ప్రశ్న.

**- తుపాకి.కామ్ సౌజన్యంతో...**

**నటీనటులు:**

తన సినిమాలు ఫెయిలైనా నటుడిగా విక్రమ్ ఫెయిలవడం అరుదు. పాత్ర కోసం ఏం చేయడానికైనా సిద్ధపడే అతను.. క్యారెక్టర్ కు తగ్గట్లు తనను తాను గొప్పగా మలుచుకోవడం.. అందులో ఒదిగిపోవడంలో దిట్ట. 'వీర ధీర శూర'లోనూ విక్రమ్ అదే చేశాడు. కిరాణా కొట్టు నడుపుకునే ఒక సాధారణ వ్యక్తిగా విక్రమ్ ప్రేక్షకులను కొన్ని నిమిషాల్లోనే ఒప్పిస్తాడు. అదే సమయంలో అవసరం వచ్చినపుడు తన వీరత్వాన్ని చూపించే సన్నివేశాల్లోనూ అదరగొట్టాడు. తనకు జోడీగా నటించిన దుషారా విజయన్ కూడా బాగా చేసింది. ఎస్పీ పాత్రలో ఎస్.జె.సూర్య జస్ట్ ఓకే అనిపిస్తాడు. తన విలక్షణతను చాటే అవకాశం ఈ క్యారెక్టర్ ఇవ్వలేదు. సూర్య మీద అంచనాలు పెట్టుకున్న వాళ్లకు నిరాశ తప్పదు. మలయాళ నటుడు సూరజ్ కీలక పాత్రలో మెప్పించాడు. తెలుగు నటుడు పృథ్వీకి ఈ చిత్రంలో అత్యంత కీలకమైన పాత్ర దక్కింది. ఎక్కువగా కామెడీ చేసే పృథ్వీ సీరియస్ పాత్రలోనూ ఆకట్టుకున్నాడు.

**సాంకేతిక వర్గం:**

జి.వి.ప్రకాష్ కుమార్ నేపథ్య సంగీతం ఈ సినిమాకు పెద్ద అసెట్. ప్రేక్షకులకు ఒక మూడ్లోకి తీసుకెళ్లేలా ఆర్ఆర్ సాగుతుంది. కీలకమైన సన్నివేశాల్లో ఇంటెన్సిటీని పెంచిన తీరు ఆకట్టుకుంటుంది. పాటలకు సినిమాలో పెద్దగా ప్రాధాన్యం లేదు. ఉన్న రెండు పాటలు సోసోగా అనిపిస్తాయి. తేని ఈశ్వర్ ఛాయాగ్రహణం కూడా బాగుంది. నిర్మాణ విలువలు బాగున్నాయి. రైటర్ కమ్ డైరెక్టర్ ఎస్.యు.అరుణ్ కుమార్ విక్రమ్ ను ఇలాంటి పాత్రలో చూపించాలనుకోవడం మంచి ఎత్తుగడే. కాన్సెప్ట్ కూడా బాగానే రాసుకున్నాడు. కానీ ఎగ్జిక్యూషన్లో గందరగోళం సినిమాను కిందికి లాగేసింది. చివరి అరగంటను మినహాయిస్తే రేసీ స్క్రీన్ ప్లే లేకపోవడం మైనస్ అయింది. కొన్ని సీన్ల వరకు బాగా డీల్ చేసినా.. సినిమా అంతా ఒక ఫ్లోలో సాగేలా చూసుకోలేకపోయాడు.



ఇప్పుడంటే అత్యంత ధనవంతులుగా ఇండియాలో గుజరాతీల హవా కనిపిస్తుండొచ్చునేమోగానీ ఒకనాడు ఈ మొత్తం భూగ్రహం మీదే మన హైదరాబాదీనే.. అందరికన్నా ధనవంతుడన్న విషయం మీకు తెలుసా..? ఆయనే మీర్ ఉస్మాన్ అలీ ఖాన్. హైదరాబాద్ ఏడవ నిజాం. ఆయన ఆస్తి మొత్తం 200 బిలియన్ డాలర్లు.. అంటే, సుమారు ఇండియన్ కరెన్సీలో 17 లక్షల కోట్ల రూపాయలకు పైమాటే. అందుకే, ఆనాడే టైం మ్యాగజీన్‌లో మీర్ ఉస్మాన్ ఖాన్ ఫీచర్ ఫోటోతో ప్రపంచ కుబేరుల్లో నంబర్ వన్ గా ఆర్టికల్ ప్రచురితమైంది. నాటి ప్రపంచ కుబేరుల్లో ఇండియన్స్ కు స్థానమే దక్కడమే గగనగండమనే పరిస్థితుల్లో ఉస్మాన్ అలీఖాన్ ఏకంగా ప్రపంచ నంబర్ వన్ ధనవంతుడిగా గుర్తింపు పొందడంతో.. ఆయన్ను ఎక్సాల్టెడ్ హైనెస్ అంటే ఉత్కృష్టమైన అవార్డుతో నాటి బ్రిటీష్ ప్రభుత్వంతో గౌరవించబడ్డ మొట్టమొదటి భారతీయ పాలకుడిగా కూడా ఆయన నిల్చిపోయాడు.

# ఎలన్‌మస్క్‌తో సరిసమానమైన సంపద..

# అప్పట్లోనే మన నిజాం కుబేరుడు!

1948లో హైదరాబాద్ రాచరిక రాష్ట్రాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడానికి ముందు వరకూ కూడా.. మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ దేశంలోనే అత్యంత ధనవంతుడిగా కొనసాగాడు. 1911లో తన తండ్రి మరణించిన తర్వాత.. ఆయన సింహాసనాన్ని స్వాధీనం చేసుకున్న ఉస్మాన్ అలీ 1948 వరకు దాదాపు 37 సంవత్సరాలు హైదరాబాద్‌ను పరిపాలించారు. పలు నివేదికల ప్రకారం ఆయన ఆస్తులు పెరిగాయే తప్ప తరగలేదు. ఆయన హైదరాబాద్ రాచరిక రాష్ట్రాన్ని భారత యూనియన్‌లో కలిపేవరకూ కూడా ఆయన ఆస్తుల నికర విలువ.. ఇవాళ్టి ఎలాన్ మస్క్ నికర విలువకు దగ్గరగా ఉండేది. అలా ఆయన రాచరిక సింహాసనం దిగేనాటికి 17 లక్షల 47 వేల కోట్ల రూపాయలు అంటే యూఎస్ డాలర్స్‌లో 230 బిలియన్ డాలర్స్ నికర ఆస్తులను కల్గి ఉన్నారు. ఆయన సంపదలో అధికశాతం ఆభరణాలుండేవి. అలా వంద మిలియన్ డాలర్ల విలువ చేసే బంగారం, 400 మిలియన్ డాలర్ల విలువ చేసే ఇతర వెండి, ముత్యాలు, రత్నాల వంటి ఆభరాణాలుండేవి. ఎంతో విలువైన 185 క్యారెట్ల జాకబ్ డైమండ్ నిజాం దగ్గర మాత్రమే ఉండేది. ప్రస్తుతం దాని విలువ దాదాపు 1 వెయ్యి కోట్ల రూపాయల వరకూ ఉండొచ్చని ఓ అంచనా. 1995లో అప్పటి భారత ప్రభుత్వం నిజాం ట్రస్ట్ నుండి 1 కోటి 30 లక్షల రూపాయలకు ఓ వజ్రాన్ని కొనుగోలు చేయగా.. అదిప్పటికీ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద ఉంది. ఆయన ఇతర ఆస్తుల్లో రోల్స్ రాయిస్ కార్లను ప్రధానంగా చెప్పుకోవాల్సి ఉంటుంది. మిలియన్లకు వజ్రాన్ని కొనుగోలు చేసింది మరియు ఇది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉంది. ఆయన ఇతర ఆస్తులలో రోల్స్ రాయిస్ కార్ల అద్భుతమైన సేకరణతోపాటు గోల్కొండ వజ్రపు గనుల కథ కనివినీ ఎరుగని రీతిలో ఉండేదంటారు.

ఇవాళంటే మేమంటే మేం హైదరాబాద్‌ను అభివృద్ధి చేశామంటూ గొప్పలు చెప్పుకునేవారు. హైదరాబాద్ డెవలప్మెంట్ విషయంలోనూ ప్రాంతీయతలను రెచ్చగొట్టేవారు.. తమ రాజకీయాలకు అనువుగా మాటలతూటాలు పేల్చేవారు కనిపిస్తుండొచ్చునేమోగానీ.. అసలు హైదరాబాద్ అభివృద్ధి ప్రధాత నిజామేనంటే అతిశయోక్తేమాత్రం కాదు. ఒక హైకోర్టైనా, సెంట్రల్ లైబ్రరీ అయినా, అసెంబ్లీ హాలైనా, స్టేట్ మ్యూజియమైనా ఇవన్నీ నిజాం అభివృద్ధి చేసినవే. అంతెందుకు



చూపించేవంటారు. ఈ భూగ్రహం మీదే అత్యంత ధనవంతుడై ఉండీ.. అలాంటి జీవనాన్ని గడపిన విషయాల్ని ల్యూక్ హార్డింగ్ అనే బ్రిటీష్ జర్నలిస్ట్ 2001లో గార్డియన్‌కు రాసిన ఓ వ్యాసంలో పేర్కొన్నారు. మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ తన 80 ఏళ్ల వయస్సులో 1967లో కన్నుమూశారు.

– బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

ఇవాళంటే శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని చూసిన మన కళ్లు చెదిరిపోతున్నాయేమోగానీ.. ఆనాడే హైదరాబాద్ లో విమానశ్రయానికి రూపకల్పన చేసినవాడు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్.

అయితే, నిజాం ఎంత ధనవంతుడో.. అంత పిసినారి అనే పేరునూ సంపాదించుకున్నారు. ఒక అనామకుడిలా కొత్త బట్టలు ధరించకపోవడం.. సుమారు 35ఏళ్ల పాటు చిరిగిన పాగానే ధరించడం, నలిగిన కాటన్ పైజామాలనే తొడగడం, బెడ్రూమ్‌లో చిరిగిన చెత్త కాగితాల నడుమే భోజనం చేసే అలవాట్లు, సాదాసీదా ప్లేట్లలో భోజనం చేసే విధానం ఇవన్నీ ఆయనెంత పిసినారో పట్టి

## ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించవద్దు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మున్సిపల్ కార్మికులను ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించే చర్యలు వెంటనే ఆపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్. అమ్మన్నాయుడు, నగర కన్వీనర్ ఆర్.ప్రకాష్, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం డిమాండ్ చేసారు. కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులను ఆప్కాస్ రద్దు చేసి ప్రయివేటు ఎజన్సీలకు కట్టబెట్టే చర్యలు ప్రభుత్వం మానుకోవాలని, పర్మినెంట్ చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో ఏడు రోడ్లు కూడలి నుండి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వరకు ప్రదర్శన అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పొరుగు సేవల కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తుందన్నారు. ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తుందని ఎంతగానో ఆశించారని కానీ ఆశాభంగం కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ పరిశుభ్రతకు దుమ్ము, దూళి, దుర్గంధం భరిస్తూ అపాయకరమైన విధుల్లో ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలకు సేవలందిస్తున్న మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్, ప్లాంటేషన్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని అన్నారు. ఆప్కాస్ రద్దుచేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తారని చెప్పడం అన్యాయమన్నారు. ఆప్కాస్ వల్ల దళారీల దోపిడీ, వేధింపులులేవని, జీతాలలో, పీఎఫ్, ఈఎస్ఐ. వాటా నిధుల్లో కోతలు లేవన్నారు. ప్రయివేటు ఏజెన్సీలు అయితే సకాలంలో వేతనాలు ఇచ్చే పరిస్థితి ఉండదని, పి.ఎఫ్,ఇ.ఎస్.ఐ సక్రమంగా చెల్లించరన్నారు. ఆప్కాస్ కంటే మెరుగైన పర్మినెంట్ చేయాలి కానీ పెనం మీద నుండి పొయ్యిలోకి పెట్టేవిధంగా ప్రయివేటు ఏజన్సీలకు అప్పగించడం సరికాదన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న వారికి జీఓ నెంబరు 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మె కాలం ఒప్పందాలు వెంటనే అమలు చేయాలని, విలీన పంచాయతీ కార్మికులకు జి.ఓ నెంబరు 3 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరిగిన నగర విస్తీర్ణానికి అనుగుణంగా మున్సిపల్ సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో కె.రాజు, ఎ.రాము, ఎ.గురుస్వామి, ఎ.శేఖర్, జె.మాధవి, డి.యుగంధర్, శంకర్ గణేష్, ఎ.దేవసంతోష్, బాల, ఎ.జనార్ధనరావు, డ్రైవర్లు హరి, నాని, ఇంజనీరింగ్ విభాగం నాయకులు పి.మణి, త్రినాథరావు, క్లాప్ డ్రైవర్లు రామకృష్ణలు పాల్గొన్నారు.



## అధైర్య పడవద్దు.. ఆదుకుంటాం

(సత్యంన్యూస్, పోలాకి)

అధైర్య పడవద్దు అన్ని విధాలుగా అండగా ఉంటామని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వనితమండలం పంచాయతీ, గజపతినగరం గ్రామానికి చెందిన దుంగ రాములమ్మకు వైద్య ఖర్చు నిమిత్తం రూ.60,600/- ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు చేసిన చెక్కును మంగళవారం కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గొప్ప మానవత్వం కలిగిన వ్యక్తి అన్నారు. అన్ని విధాలుగా సహకరిస్తుండడం గొప్ప విషయమన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎందరో పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మెండ రాము గారు, మరియు ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాలనను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పాలనను పూర్తిగా గాలికి వదిలేసిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అంబటి కృష్ణ అన్నారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. అభివృద్ధి అంటే రాజధాని నిర్మాణం ఒకటే అన్నట్టుగా కూటమి ప్రభుత్వ నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారని చెప్పారు. తల్లికి వందనం పేరుతో ఎంతమంది పిల్లలు చదువుకుంటే వారందరికీ రూ.15వేల చొప్పున అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ఆ పథకాన్ని మర్చిపోయిందన్నారు. ఉపాధి, ఉద్యోగాలు లేక యువత ఇతర ప్రాంతాలకు వలసలు పోయే పరిస్థితిలో నెలకొంటుందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్రంలో 32 వేల మంది మహిళలు అదృశ్యం అయ్యారని చెప్పిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రస్తుతం మహిళల భద్రతపై మాట్లాడకపోవడం విస్మయానికి గుర్తు చేస్తుందన్నారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ ఆసుపత్రి నిర్మించినప్పటికీ వాటిలో కనీస మౌలిక, వసతులు సదుపాయాలు కల్పించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది, వైద్యుల కొరత వేధిస్తోందన్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు త్వరలోనే క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రభుత్వ నిరంకుశపాలనపై పోరాటాలు చేస్తామని అంబటి కృష్ణ వెల్లడించారు. అనంతరం జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులుగా చాన్ భాషను, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు అంబటి దాలినాయుడును నియమిస్తూ ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గాదం వెంకట త్రినాధరావు, కేవీఎల్ఎస్ ఈశ్వరి, సాయి దుర్గా, కొత్తపల్లి రాంప్రసాద్, సోడవరం చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.



# యువతకి ఉద్యోగావకాశాల కల్పన మా ధ్యేయం

- 20 లక్షల ఉద్యోగాల కల్పన ప్రభుత్వ లక్ష్యం.
- వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

(సత్యంన్యూస్, కోటబొమ్మాళి)

స్థానిక నిరుద్యోగ యువతి యువకులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జాబ్‌మేళాను కోటబొమ్మాళిలో ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలియజేశారు. కోటబొమ్మాళి జూనియర్ కాలేజి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాలో మాట్లాడుతూ 32 కంపెనీల ద్వారా 1200 ఉద్యోగాలకు అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళాను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ప్రైవేట్ రంగంలోని ఉద్యోగాలకు సరైన నైపుణ్యం గల అభ్యర్థులను అందించడం కోసం నైపుణ్య శిక్షణ కేంద్రాల ద్వారా మెరుగైన వసతులతో కూడిన శిక్షణను అందిస్తున్నట్లు తెలియజేశారు. ఒక్క ప్రభుత్వ ఉద్యోగాలతో అందరికీ ఉపాధి లభించడం కష్టతరంగా మారడం వలన ప్రైవేటు రంగం స్వయం ఉపాధి రంగాల్లో కూడా అభ్యర్థులను తీర్చిదిద్దే విధంగా నైపుణ్య శిక్షణ అమలు చేస్తున్నామన్నారు. ప్రతి జిల్లాలో జాబ్ మేళాలు నిర్వహించడమే కాకుండా ప్రతి మండలానికి జిల్లాకు రాష్ట్రంలో ఎన్ని ఉద్యోగాలు కల్పించామో తెలుసుకునే విధంగా అన్నింటినీ ఆన్లైన్ చేస్తామన్నారు. మన ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలు పెరగాలంటే పారిశ్రామికముగా అభివృద్ధి చెందాలన్నారు. దీనిలో భాగంగా ఇండస్ట్రియల్ పార్క్ ప్రతి నియోజకవర్గానికి ఒకటి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. ముఖ్యమంత్రి ముందుచూపుతో సరైన ప్రణాళిక ద్వారా తొమ్మిది మాసాలలో ఏడు లక్షల పెట్టుబడులు తీసుకురాగలిగి తద్వారా ఉద్యోగావకాశాల కల్పనకు కృషి చేశారని తెలియజేశారు. తాము నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమాలలో 90 శాతం దరఖాస్తులు ఉద్యోగాల కోసమే వస్తున్నాయని అందుకోసమే కంపెనీలను మన ప్రాంతానికి తీసుకువచ్చి జాబ్‌మేళా నిర్వహించే విధంగా ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ వేతనం ప్రదేశంతో సంబంధం లేకుండా ముందుగా ఉద్యోగంలో చేరేటందుకు చొరవ తీసుకోవాలని, తదనంతరము అనుభవము ప్రాతిపదికగా మంచి వేతన అవకాశాలు లభిస్తాయని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోఉపాధికల్పనలో భాగంగా 18 నుండి 30 ఏళ్ల మధ్య ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు మెగా జాబ్‌మేళా నిర్వహించామన్నారు. ఈ మెగా జాబ్‌మేళాకు సుమారు 31 కంపెనీ ప్రతినిధులు హాజరయ్యి 1215 పోస్టులకు గాను అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపికకు కార్యాచరణ రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో ఏ.పి.ఎస్.ఎస్.డి.సి జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్, జిల్లా ఉపాధి అధికారి కే సుధ, సెట్ శ్రీ సీఈవో ప్రసాదరావు, నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ ఉజ్వల, ప్లేస్మెంట్ ఆఫీసర్ వంశి ఇతర అధికారులు అనధికారులు పాల్గొన్నారు.



## తెలంగాణా వేదికపై మెరిసిన సిక్కోలు చిన్నారులు

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

తెలంగాణా రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో ఆమదాలవలసకు చెందిన నృత్య విద్యార్థినిలు అద్భుతమైన ప్రదర్శనతో ప్రశంసలందుకున్నారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకల్లో భాగంగా అక్కడి ప్రభుత్వం నిర్వహించిన ధార్మిక కార్యక్రమంలో భాగంగా ఆమదాలవలస పట్టణానికి చెందిన నాట్యశ్రీ కళానికేతన్ విద్యార్థినిలు నృసింహ వైభవం నృత్యరూపకాన్ని అద్భుతంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. నృత్య శిక్షకురాలు కూన శ్రీలత నృత్య దర్శకత్వంలో సుస్మిత, హిమశ్రీ, జ్ఞానశ్రీవల్లి, లాస్యప్రియలు నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. కాగా నిర్వాహకులు చిన్నారులకు నగదు పారితోషికంతోపాటు ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను బహుకరించి సత్కరించారు.



'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# రాకాసి అలలకు

## ఇద్దరు మత్స్యకారులు గల్లంతు

(సత్యంన్యూస్, పలాస)

వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్ల పేటలో మంగళవారం ఉదయం సముద్రంలో వేటకు వెళ్లి రాకాసి అలకు ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. మంచినీళ్లపేటలో మంగళవారం ఉదయం నాలుగు గంటల సమయంలో గ్రామానికి చెందిన బొంగ కోటేశ్వరరావు, చింతల వెంకటేష్, వంక కృష్ణ, బుంగ ధనరాజు నలుగురు వేటకు వెళ్లారు. రాకాసి అలలకు బోటు బోల్తా పడింది. ఈ ఘటనలో చింతల వెంకటేష్, బొంగ కోటేశ్వరరావు ఈదుకుంటూ ప్రమాదం నుంచి తప్పించుకొని ఒడ్డుకు చేరుకున్నారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. వీరి ఆచూకీ కోసం స్థానిక మత్స్యకారులు సముద్రంలో గాలిస్తున్నారు.

### - మత్స్యకారుల గల్లంతుపై మంత్రి ఆరా -



మత్స్యకారుల గల్లంతుపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరా తీశారు. ఫోన్‌లో మత్స్యశాఖ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వేటకు వెళ్లి వస్తుండగా మత్స్యకారుల బోటు తిరగబడడంతో ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. గల్లంతైన నలుగురు మత్స్యకారుల్లో ఇద్దరు క్షేమంగా ఒడ్డుకు చేరుకోవడంతో, మిగిలిన ఇద్దరు మత్స్యకారులను ఒడ్డుకు చేర్చేందుకు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

### కమర్షియల్ గ్యాస్ సిలిండర్

# ధర తగ్గింపు



వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరను చమురు సంస్థలు తగ్గించాయి. హోటళ్లు, రెస్టారెంట్లతో పాటు వాణిజ్య అవసరాల కోసం వాడే కమర్షియల్ ఎల్‌పీజీ ధరను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తగ్గించాయి. రూ.41 వరకు తగ్గించినట్టు ఆయా సంస్థలు వెల్లడించాయి. మంగళవారం నుంచే ఈ ధరలు అమలులోకి రానున్నాయి. అయితే రాష్ట్రాలను బట్టి ఈ తగ్గింపులో మార్పు ఉంటుంది. ఢిల్లీలో ఈ సిలిండర్ ధర రూ.1762, ముంబయిలో రూ.1714, చెన్నైలో రూ.1924.50గా ఉంది. ఇక గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధరను చమురు సంస్థలు సవరించలేదు. *- సత్యం ఐటీ డెస్క్*

# పేదల సంక్షేమానికి సంకేతం పెన్షన్ల పంపిణీ



**రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు**

(సత్యంన్యూస్, టెక్కలి)

ప్రతి నెలా ఒకటో తేదీ పేద ప్రజలకు పండుగలా మారుతోందని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పెరిగిన పింఛన్లు లబ్ధిదారులకు అందించడంతో పాటు, ప్రభుత్వం మాట ఇచ్చినట్లుగా సంక్షేమ పథకాలను అమలుచేసి ప్రజలకు మంచి చేస్తామని తెలిపారు. కోటబొమ్మాళి మండలం కిష్టుపురం గ్రామంలో మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు లబ్ధిదారులకు పెరిగిన పింఛన్లను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సంకేతమని అన్నారు. అభివృద్ధి లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వం ముందుకు సాగుతుందని, సంక్షేమమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టెక్కలి రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణమూర్తి నాయుడు, కింజరాపు హరిప్రసాద్, కోటబొమ్మాళి తహసిల్దార్, మండల అభివృద్ధి అధికారి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసాతో నిరుపేదలకు ఆసరా



(సత్యంన్యూస్, గార/ శ్రీకాకుళం)

ఎన్టీఆర్ భరోసాతో నిరుపేద కుటుంబాలకు ఆసరా కలిగిందని, పేద కుటుంబాలకు సకాలంలో ఈ పింఛన్ల పంపిణీ జరగడంతో వారు ఎంతో సంతోషిస్తున్నారని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండలం వాడాడ, అచ్చన్నపాలెం, రెడ్డిపేట గ్రామాలతో పాటు శ్రీకాకుళం పట్టణంలోని గుజరాతిపేటలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫించన్ల పంపిణీ కార్యక్రమం గ్రామ గ్రామాల్లో పండగ వాతావరణంలో కొనసాగుతుందని అన్నారు. అనుకున్న సమయానికి కచ్చితంగా పంపిణీ జరుగుతుందనీ, ఇది ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు.



# ఎండలో రేషన్ పంపిణీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రేషన్ బియ్యం పంపిణీ చేసే ఎండీయూ వాహన యజమాని తీరుతో లబ్ధిదారులు ఎండలోనే నిల్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. శ్రీకాకుళం నగర కార్పొరేషన్ స్థానిక న్యూకాలనీలో మండుటెండలో రేషన్ బండి నిలిపి సరుకులు పంపిణీ చేయడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రజలు అగచాట్లు పడకూడదని ప్రతీ సెంటర్‌కు వెళ్లి పంపిణీ చేయాలని ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనం కనీసం నీడలో నిల్చోబెట్టకుండా ఇలా రోడ్డుపై, అదీ ఎండలో పార్క్‌చేసి బియ్యం పంపిణీ చేయడంపై లబ్ధిదారులతో పాటు పలువురు విమర్శిస్తున్నారు.














**శ్రీకాకుళం జిల్లా ప్రజలకు శుభవార్త**

**ప్రముఖ ప్రసూతి మరియు స్త్రీవైద్య నిపుణులు**

తేది: 5-4-2025 శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచితంగా చూడబడును.

డా॥ బొడ్డేపల్లి మీనాక్షి M.B.B.S., DGO

ప్రసూతి మరియు స్త్రీ వైద్యనిపుణులు

హిమోగ్లోబిన్, షుగర్ టెస్టులు ఉచితంగా చేయబడును.
అవసరమైనచో థైరాయిడ్ టెస్ట్ 50% రాయితీతో చేయబడును.
ఉచితంగా ఓపీ చూడబడును. ఈ అవకాశం ఈ ఒక్కరోజు మాత్రమే.

తేది: 5-4-2025 శనివారం
ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు

-: ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకోవలెను :-

**శ్రీ వైష్ణవి గణేష్ డాక్టర్స్ ప్లాజా**

డే & నైట్ జంక్షన్, పెట్రోల్ బంకు ఎదురుగా,
సత్య లాడ్జి ప్రక్కన, శ్రీకాకుళం, సెల్: 99854 69073, 98661 68604, 70755 18604


# క్యాన్సర్ బాధితునికి చేయూత



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

క్యాన్సర్‌తో బాధపడుతున్న అంపోలుకు చెందిన ఉట్ల హేమంత్ కుమార్ కుటుంబానికి పలువురు దాతలు అండగా నిలుస్తున్నారు. తాజాగా నగరానికి చెందిన కె.విశ్వనాథ్, ప్రనణ్య దంపతులు, పలాస ప్రాణదాత బ్లడ్ సెంటర్ మేనేజర్ సాయి, సిరుల శరత్‌ల సహకారంతో హేమంత్‌కు అవసరమైన మందులు, ఆయన కుటుంబానికి మూడు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులతో పాటు రెండు రైస్ ప్యాకెట్లు అందించారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర వైస్ చైర్మన్ పి.జగన్మోహన్ రావు చేతులమీదుగా బాధితునికి మంగళవారం ఈ సహాయం అందించారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ అసోసియేట్ నల్ల గౌతమి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు బి.చిన్మయరావు, నంది, ఉమా శంకర్, బి.జగదీష్ జి.పవన్‌కుమార్, బొట్టా సాయికుమార్ పాల్గొన్నారు.

### గిరిజనుల కష్టానికి

# ప్రపంచవ్యాప్త గుర్తింపు

*** అరకు కాఫీపై పార్లమెంట్‌లో ఎంపీ కలిశెట్టి**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అరకు కాఫీపై పార్లమెంట్ సమావేశాల్లో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మంగళవారం మాట్లాడారు. అరకు కాఫీ ప్రమోషన్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక పాత్రను, నాంది ఫౌండేషన్ స్థాపనలో ఆయన చొరవను, అలాగే పారిస్‌లో రెండవ అరకు కాఫీ కేఫ్ ప్రారంభంలో పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా కృషిని ప్రశంసించారు. అరకు కాఫీని ప్రపంచ స్థాయిలో ప్రమోట్ చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి అసాధారణమన్నారు. బాబు ఆలోచనలు, చొరవతో గిరిజన రైతులు సాగుచేసే కాఫీ ఖ్యాతి ఖండాంతరాలను దాటిందన్నారు. నాంది ఫౌండేషన్ స్థాపన ద్వారా కాఫీ సాగుకు సాంకేతిక, మార్కెటింగ్ సహకారం అందించేలా చంద్రబాబు కృషి గిరిజనుల జీవనోపాధిని మెరుగుపరిచిందన్నారు. చంద్రబాబు నాయుడు బ్రాండ్‌కు అరుకు కాఫీ తలమానికమని, బాబు దూరదృష్టికి ప్రపంచంలో అందరూ ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. పారిస్‌లో రెండవ అరకు కాఫీ కేఫ్ ప్రారంభం ఒక చారిత్రక ఘట్టమని, ఈ విజయంలో ఆనంద్ మహీంద్రా సహకారం మరపురానిదన్నారు. చంద్రబాబు విజన్‌ను ఆనంద్ మహీంద్రా అభినందిస్తూ, బాబు ఆలోచనలు అద్భుతమని ప్రశంసించడం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమన్నారు. తూర్పు కనుమల నుంచి పార్లమెంట్ అక్కడ నుంచి పారిస్ వరకు అరకు కాఫీ ప్రస్థానం గిరిజనుల కష్టానికి ప్రపంచ గుర్తింపును తెచ్చిపెట్టిందని ఎంపీ అప్పలనాయుడు తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న ప్రయత్నాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయన్నారు. సీనియర్ నాయకుడిగా దేశానికి ఒక ఆదర్శమని పేర్కొన్నారు. ఈ విజయం గిరిజన సంక్షేమానికి, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఒక మైలురాయని అప్పలనాయుడు ఉద్ఘాటించారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.